TELANGANA CAPITAL

# తెలంగాణ క్యాపిటల్

నిజం.. నిజాయితీ.. నిబద్ధత

TELANGANA CAPITAL NEWS

www.telanganacapitalnews.com

హైదరాబాద్ | సంపుటి : 1 సంచిక: 115 | బుధవారం, ఆగస్టు 28, 2024 | కంప్లమెంటరీ కాపీ | పేజీలు : 4

## "థాంక్యూ సుప్రీంకోర్టు"

ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసిన నేపథ్యంలో ఆమె సోదరుడు, పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. "థాంక్యూ సుప్రీంకోర్టు. ఊరట లభించింది.. న్యాయం గెలిచింది" అని పేర్కొన్నారు.

# నేను కేసీఆర్ బిడ్డను.. వడ్డితో సహా చెల్లిస్తా...



## కవిత వార్నింగ్

హైదరాబాద్: తీహార్ జైలు నుంచి విడుదలైన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. నన్ను అన్యాయంగా జైల్లో పెట్టినవారికి వడ్డితో సహా చెల్లిస్తానని కవిత వార్నింగ్ ఇచ్చారు. సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేసిన అనంతరం కాసేపటి క్రితం కవిత జైలు నుంచి విడుదల అయ్యింది. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను కౌగిలించుకుని కవిత ఎమోషన్ అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడిన కవిత... పిల్లలను వదిలి ఐదున్నర నెలలు జైలులో ఉండటం ఇబ్బందికర విషయం. నేను కేసీఆర్ బిడ్డను.. తప్పు చేసే ప్రసక్తే లేదు. మొండిదాన్ని.. మంచిదాన్ని. అనవసరంగా నన్ను జైలుకు పంపి జగమొండిని చేశారు. నన్ను నా కుటుంబాన్ని ఇబ్బందులకు గురిచేసిన వారికి వడ్డీతో సహా చెల్లిస్తాం. చట్టబద్ధంగా నా పోరాటం కొనసాగిస్తా. క్షేత్ర స్థాయిలో మరింత నిబద్ధతగా పనిచేస్తాం" అని కవిత వార్నింగ్ హెచ్చరించారు.

### సిసోడియాకు వర్తించిన నిబంధనలే...

## కవితకు వర్తిస్తాయి

### : ముకుల్ రోహత్గీ



ఢిల్లీ: ఎంఎల్సి కవిత బెయిల్ పిటషన్‌పై సుప్రీం కోర్టులో విచారణ జరుగుతోంది. జస్టిస్ బిఆర్ గవాయి, జస్టిస్ విశ్వనాథన్ ధర్మాసనం విచారణ చేసింది. ఎంఎల్సి కవిత తరపున ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. ఇడి కేసులో కవిత ఐదు నెలలుగా జైలులో ఉన్నారని, ఈ కేసులో 493 మంది సాక్షులను విచారించారని, ఒక మహిళగా కవిత బెయిల్‌కు అర్హురాలు అని, కవిత మాజీ ఎంపి అని, ఆమె ఎక్కడికీ వెళ్లరని ముకుల్ స్పష్టం చేశారు. రూ.100 కోట్ల ముడుపుల ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని, కవిత నుంచి ఇప్పటివరకు ఎలాంటి సొమ్ము రికవరీ చేయలేదన్నారు. ఇదే కేసులో ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాకు బెయిల్ మంజూరైందని, సిసోడియాకు వర్తించిన నిబంధనలే కవితకు వరిస్తాయని ముకుల్ కోర్టుకు విన్నవించారు. దర్యాప్తు సంస్థలు అడిగిన ఫోన్లను కవిత అప్పగించారన్నారు.

## రాజ్యసభ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన మను సింఘ్వీ




న్యూఢిల్లీ: తెలంగాణ రాజ్యసభ ఎన్నికలకు నామినేషన్ ఉపసంహరణ గడువు ముగిసింది. కాంగ్రెస్ తరఫున అభిషేక్ మను సింఘ్వీ, ఇండిపెండెంట్ గా పద్మరాజన్ నామినేషన్ దాఖలు చేశారు. ఎంఎల్ఏ లు బలపరచకపోవడంతో పద్మరాజన్ నామినేషన్ తిరస్కరణకు గురయింది. దీంతో రాజ్యసభ సభ్యుడిగా సింఘ్వీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సింఘ్వీ తరపున కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు నిరంజన్ ఎన్నికల అధికారి నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకున్నారు. అభిషేక్ సింఘ్వీ రెండు దఫాలుగా(2006, 2018) రాజ్యసభ సభ్యుడిగా కొనసాగారు. ఈ ఏడాది హిమాచల్ ప్రదేశ్ నుంచి రాజ్యసభకు పోటీ చేసి బిజెపి చేతిలో ఓడిపోయారు.

## బెంగాల్‌లో...

# ఉద్రిక్తత

కోల్ కతా: పశ్చిమ బెంగాల్ లో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచారం ఇప్పుడు అక్కడి ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాజీనామా చేయాలంటూ విద్యార్థి సంఘం 'పశ్చిమ బంగా ఛాత్రో సమాజ్' మంగళవారం నిరసన చేపట్టింది. 'నబన్నా అభియాన్' పేరిట విద్యార్థులు హవ్ డా నుంచి ర్యాలీ నిర్వహించారు. అయితే వీరిని పోలీసులు అడ్డుకోవడంతో సంతర్ గాచి వద్ద ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఆందోళనకారులు బారికేడ్లను లాగి పడేశారు. పోలీసులపై రాళ్లు రువ్వారు. దాంతో పోలీసులు భాష్ప వాయువు ప్రయోగించారు. ఉద్రిక్తత తీవ్రంగా ఉండడంతో మమతా బెనర్జీ ఇంటి వద్ద భద్రతను పెంచారు. పోలీసులు నలుగురు విద్యార్థులను అరెస్టు చేశారు. విశేషమేమిటంటే ఆ విద్యార్థులు అర్ధరాత్రి నుంచే కనిపించడంలేదు.





## శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న గవర్నర్

భువనగిరి: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దర్శించుకున్నారు. గవర్నర్‌కు పూర్ణకుంభంతో అర్చకులు. ఆలయ ఇఒ, అధికారులు ఘన స్వాగతం పలికారు. గర్భాలయంలో ప్రత్యేక పూజలు, వేద ఆశీర్వచనం నిర్వహించిన అనంతరం స్వామివారి ప్రసాదం గవర్నర్ కు ఆలయ అర్చకులు అందజేశారు. గవర్నర్ మంగళవారం ఉదయం హైదరాబాద్ నుంచి యాదాద్రి చేరుకున్నారు.

## హిందువులకు యోగి ఆదిత్యానాథ్...

# హెచ్చరిక



లక్నో: హిందువులంతా సంఘటితంగా ఉండాలి , లేకపోతే బంగ్లాదేశ్ మాదిరి పరిణామాలు ఇక్కడా జరుగుతాయని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్ హెచ్చరించారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు జరుగుతున్నాయి. దీనిని గమనించి అయినా హిందువులంతా ఒక్క తాటిపై నిలవాల్సి ఉందని తెలిపారు. సోమవారం ఆయన ఆగ్రాలో ఓ కార్యక్రమంలో మాట్లాడారు. భాటేంగే తో ఖాటేంగే అని ఫక్కా యుపి హిందీ యాస్‌లో సిఎం తెలిపారు. పార్టీలు, వర్గాలు పేరిట హిందువులు విడిపోవడం జరిగితే, దుష్ఫలితాలు చూడాల్సి వస్తుందన్నారు. సంఘటితంగా ఉండటమే మన జాగరూకత అన్నారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడుల పట్ల ప్రతిపక్షాలు పెదవివిప్పకపోవడం దారుణం అన్నారు. అక్కడి దురాగతాలను ఖండించాల్సిన అవసరం లేదా? అని నిలదీశారు. విడిపోతే పడిపోవడం ఖాయం అన్నారు. మన వైఖరితోనే మనం ఊచకోతలకు గురి అయితే ఇంతకంటే దారుణం ఉంటుందా? అని ప్రశ్నించారు. ఆగ్రాలో అమరవీరుడు దుర్గాదాస్ రాథోడ్ విగ్రహం ఆవిష్కరణ తరువాతి సభలో ఆయన మాట్లాడారు. 17వ శతాబ్ధంలో మొఘలు చక్రవర్తి ఔరంగజీబుతో పోరు సల్పిన రాథోడ్‌ను యోగి స్మరించుకున్నారు. దేశం అన్నిం టికంటే మిన్న , దేశాన్ని మించినది లేదని, మనం చరిత్ర నుంచి ఎంతో తెలుసుకుని తీరాలి. తప్పిదాలకు దారి ఇవ్వరాదని పిలుపు నిచ్చారు.

### నేడు తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

హైదరాబాద్: తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనకు సంబంధించి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక విషయాన్ని వెల్లడించారు. రేపు ఉదయం 11 గంటలకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు భూమిపూజ నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఈ ఏడాది డిసెంబర్ 9న ఆవిష్కరించనున్నట్టు సీఎం ప్రకటించినట్లుగానే తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కాగా, ఈ భూమిపూజ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరుకానున్నారు.



# కోల్‌కతా డాక్టర్ 'అప్పటికే విగతజీవి'

కోల్‌కతా డాక్టర్‌పై హత్యాచారం కేసులో అరెస్టయిన సివిక్ వాలంటీర్ సంజయ్ రాయ్ తాను ఆమెను చూసేటప్పటికే విగతజీవి అని, తాను భయంతో అక్కడి నుంచి పారిపోయానని ఆదివారం నిజనిర్ధారణ పరీక్షలో చెప్పినట్లు తెలుస్తోంది. సంజయ్ రాయ్ పలు 'ఎలిబీలు' పేర్కొన్నట్లు సిబిఐ వర్గాలు ఒక ఆంగ్ల వార్తాపత్రికతో చెప్పారు. తాము ప్రశ్నిస్తున్న సమయంలో సంజయ్ రాయ్‌లో 'విసుగు కనిపించలేదు, కాని ఆత్రంగా ఉన్నాడు' అని సిబిఐ వర్గాలు తెలిపాయి. అయితే, సంజయ్ రాయ్‌పై నిర్వహించిన నిజ నిర్ధారణ పరీక్షలో పలు 'తప్పుడు, అవిశ్వసనీయ సమాధానాలు' ఇచ్చాడని తెలుస్తోంది. కోల్‌కతాలోని ఆర్‌జి కర్ వైద్య కళాశాల, ఆసుపత్రిలో ఒక మహిళా డాక్టర్‌పై హత్యాచారం సందర్భంగా ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్‌పై సిబిఐ అధికారులు పోలిగ్రాఫ్ లేదా నిజ నిర్ధారణ పరీక్ష నిర్వహించారు. రాయ్ ప్రస్తుతం నిర్బంధంలో ఉన్న కోల్‌కతా ప్రెసిడెన్సీ జైలులో ఈ పరీక్ష నిర్వహించారని అధికారి ఒకరు తెలియజేశారు. తాను పోలిగ్రాఫ్ పరీక్షకు సిద్ధమని నిందితుడు సంజయ్ రాయ్ ఒక ప్రత్యేక కోర్టుకు తెలియజేసినట్లు అతని న్యాయవాది ఇంతకుముందు ఒక వార్తాచానెల్‌తో చెప్పారు. ఎందుకు సిద్ధమని న్యాయమూర్తి అడిగినప్పుడు తాను 'అమాయకుడిని' అని, 'ఇరికించారు ' అని రాయ్ చెప్పినట్లు న్యాయవాది తెలిపారు. 'పోలిగ్రాఫ్ పరీక్ష ద్వారా నిజం వెలుగులోకి రావాలని నేను కూడా కోరుకుంటున్నా' అని రాయ్‌ని ఉటంకిస్తూ న్యాయవాది చెప్పినట్లు ఆ వార్తా చానెల్ ఈ నెల 24న తెలియజేసింది. వైద్య కళాశాల సెమినార్ హాల్‌లో 31 ఏళ్ల ట్రైనీ డాక్టర్ మృతదేహం కనిపించిన రోజు ఈ నెల 10న 33 ఏళ్ల రాయ్‌ని కోల్‌కతా పోలీసులు అరెస్టు చేశారు. పిటిఐ వార్తా సంస్థ కథనం ప్రకారం, ట్రైనీ డాక్టర్ మృతదేహం సమీపంలో కనిపించిన ఒక బ్లూటూత్ పరికరం రాయ్ అరెస్టుకు దారి తీసింది. సెమినార్ హాల్ ఉన్న ఆసుపత్రి మూడవ అంతస్తులో అతను ఉన్నట్లు సిసిటివి ఫుటేజ్‌లో కూడా కనిపించింది. కేంద్ర దర్యాప్తు సంస్థ అధికారులు తమ కోల్‌కతా కార్యాలయంలో మరి ఇద్దరిపై కూడా పోలిగ్రాఫ్ పరీక్షలు నిర్వహించారని అధికారి ఒకరు తెలిపారు. కాగా, రాయ్‌పై పోలిగ్రాఫ్ పరీక్ష సుమారు నాలుగు గంటల తరువాత ముగిసిందని ఆయన తెలియజేశారు.

## ఇది కోర్టు ధిక్కారమే...

# బండికి కెటిఆర్ కౌంటర్



హైదరాబాద్ : ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయటంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. సుప్రీంకోర్టుకు ఉద్దేశాలు ఆపాదించేలా కామెంట్స్ చేసిన బండి తీరును తప్పుబట్టారు. ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలా విజయమంటూ బండి సంజయ్ ట్వీట్ చేశారు. వైన్ అండ్ డైన్ క్రైమ్ లో పార్టనర్స్ అయిన కాంగ్రెస్, బీఆర్ఎస్ లకు కంగ్రాట్యులేషన్స్ అంటూ సుప్రీంకోర్టు తీర్పుపై బండి సంజయ్ కామెంట్స్ చేశారు. దీనిపై కేటీఆర్ తీవ్రంగా మండిపడ్డారు. కేంద్ర హెూంశాఖ సహాయశాఖ మంత్రిగా ఉన్న బండి సుప్రీంకోర్టు తీర్పుపై అభ్యంతరం వ్యక్తం చేయడం సరికాదని తెలిపారు. గౌరవప్రదమైన స్థానంలో ఉండి ఇలా స్పందించడమేంటని నిలదీశారు. ఈ వ్యాఖ్యలను కోర్టు ధిక్కారంగా తీసుకుని బండి సంజయ్‌పై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీని సెప్టెంబర్ 3 వరకు

# పొడగించిన ఢిల్లీ కోర్టు

న్యూఢిల్లీ: ఢిల్లీ కోర్టు ఎక్సయిజ్ స్కామ్ అవినీతి కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి జ్యుడీషియల్ కస్టడీని సెప్టెంబర్ 3 వరకు పొడగించింది. స్పెషల్ జడ్జీ కావేరి బవేజా ఈ కస్టడీని పొడగించింది. కేజ్రీవాల్ ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టు ముందు ప్రవేశపెట్టారు. కేజ్రీవాల్‌పై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) దాఖలు చేసిన అనుబంధ ఛార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకోవాలా వద్దా అనే దానిపై ప్రస్తుతం కోర్టు వాదనలు వింటోంది.



## బిఎస్‌పి అధ్యక్షురాలిగా మళ్లీ మాయావతి ఏకగ్రీవ ఎన్నిక

లక్నో: బహుజన్ సమాజ్ పార్టీ(బిఎస్‌పి) జాతీయ అధ్యక్షురాలిగా మాయావతి ఏకగ్రీవంగా మరోసారి ఎన్నికైనట్లు ఆ పార్టీ మంగళవారం ప్రకటించింది. బిఎస్‌పి కేంద్ర కార్యవర్గం, జాతీయ స్థాయి సీనియర్ కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర పార్టీ విభాగాలు, దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు చెందిన ప్రతినిధుల ప్రత్యేక సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ తెలిపింది. ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రిగా నాలుగు పర్యాయాలు పనిచేసిన మాయావతిని రెండు దశాబ్దాల క్రితం తన రాజకీయ వారసురాలిగా ఆ బిఎస్‌పి వ్యవస్థాపకుడు కాన్షీరాం ప్రకటించారు.



## రూ.10 లక్షల లంచం కేసు: ఐటి ప్రిన్సిపల్ కమిషనర్‌ను అరెస్టు చేసిన సిబిఐ


న్యూఢిల్లీ: వివిధ అసెస్సీల నుంచి రూ. 10 లక్షల మేరకు లంచం తీసుకున్నారన్న ఆరోపణపై ఆదాయపు పన్ను శాఖ (పాట్నా, ధన్‌బాద్) ప్రిన్సిపల్ కమిషనర్‌ను, మరి నలుగురిని సిబిఐ మంగళవారం అరెస్టు చేసినట్లు అధికారులు వెల్లడించారు. రూ. 10 లక్షల మేరకు ముడుపుల బదలాయింపు సమయంలో నలుగురు ప్రైవేట్ వ్యక్తులతో పాటు ఐటి ప్రిన్సిపల్ కమిషనర్ సంతోష్ కుమార్‌ను అరెస్టు చేసినట్లు వారు తెలియజేశారు. తన అధికార పదవిని దుర్వినియోగం చేస్తూ వివిధ ఐటి అసెస్సీలకు అనుచిత లబ్ధి చేకూర్చడానికి తన పరిధిలోని ఆ అసెస్సీల నుంచి ముడుపులు కోరుతూ, అందుకుంటున్నారన్న ఫిర్యాదు ఆధారంగా నమోదు చేసిన ఒక ఎఫ్‌ఐఆర్‌లో కుమార్‌ను సిబిఐ అరెస్టు చేసిందని అధికారులు వివరించారు. 'ఐటి ప్రిన్సిపల్ కమిషనర్ (పాట్నా, ధన్‌బాద్) తరఫున పలువురు ఏజెంట్లు పని చేస్తున్నారని కూడా ఆరోపణ



వచ్చింది' అని సిబిఐ అధికార ప్రతినిధి ఒక ప్రకటనలో తెలియజేశారు. అరెస్టుల తరువాత పాట్నా, ధన్‌బాద్, నోయిడాలలో 21 చోట్ల సిబిఐ సోదాలు నిర్వహించి, నేర సంబంధిత పత్రాలు, వస్తువులను స్వాధీనం చేసుకున్నదని అధికారులు తెలిపారు.

# ఆ ఫ్లెక్సీపై కెటిఆర్ మండిపాటు

హైదరాబాద్: వరంగల్ కార్పొరేషన్ అధికారులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మండిపడ్డారు. ఫెక్సీలోని ప్రభుత్వ చిహ్నం విషయంలో ఎక్స్‌లో కెటిఆర్ పోస్టు చేశారు. తెలంగాణ అస్తిత్వ చిహ్నాలైన కాకతీయ కళాతోరణం, చార్మినార్ లేకుండా ప్రభుత్వం చిహ్నం ఉందని మండిపడ్డారు. అధికారిక నిర్ణయమా? లేక అనధికార నిర్లక్ష్యామా? అని కెటిఆర్ ప్రశ్నించారు. ఫ్లెక్సీ గురించి మీకైనా తెలుసా అంటూ సిఎస్‌కు ట్యాగ్ చేశారు. కొత్త చిహ్నాన్ని ఎప్పుడు, ఎవరు ఆమోదించారని కెటిఆర్ నిలదీశారు. ఒకవేళ ఆమోదించకపోతే అధికారులు ఎందుకు వాడారని ప్రశ్నించారు. దీనికి కారకులెవరో తెలుసుకొని వారిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాజముద్ర వివాదస్పమైంది.. ఓ ఫ్లెక్సీలో రాజముద్ర మార్చడం హాట్ టాపిక్ గా మారింది.. అనధికార లేఔట్ లు ప్లాట్లు క్రమబద్ధీకరణ పై వరంగల్ గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసింది .తెలంగాణ ప్రభుత్వం పేరిట ఫ్లెక్సీని ఆ డెస్క్ వద్ద కట్టారు. ఆ ఫ్లెక్సీలో ప్రభుత్వ రాజముద్ర మార్చడం వివాదస్పదంగా మారింది. మంగళవారం ఈ విషయమై కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఫిర్యాదు చేశారు . ప్రభుత్వం ఏర్పాటు చేసినఫ్లెక్సీలో కాకతీయ కళాతోరణం చార్మినార్ తో కూడిన అధికార ముద్రను ఉపయోగించలేదు. దానికి బదులు ప్రభుత్వం మార్చాలనుకుని భావిస్తున్న మరో రాజముద్ర ఫ్లెక్సీ పై ఉండడం పట్ల ఆందోళన కు దారి తెలిసింది. ప్రభుత్వ ఆమోదం తెలుపకుండానే ప్రతిపాదిత రాజ ముద్రను ఉపయోగించడంపై విమర్శలు వెల్లువెత్తాయి.. అందులో ప్రధానంగా




కాకతీయుల రాజధాని అయిన ఓరుగల్లు నగరంలో కాకతీయ కళాతోరణాన్ని తొలగించడం మరింత అగ్గి రాజేసింది. ఓరుగల్లు ప్రజలు భగ్గుమన్నారు.సోషల్ మీడియా వేదికగా విమర్శనాస్త్రాలు సంధించారు. తెలంగాణ అస్తిత్వానికి చిహ్నమైన కాకతీయ కళాతోరణం చార్మినార్ లను తొలగించడంపై అగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ విషయమై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కి ఫిర్యాదు చేశారు అధికారికంగా ఏర్పాటు చేసిన ముద్రా.. లేదా అనే విషయంపై వివరణ కోరారు కొత్త చిహ్నాం ఎవరు ఎప్పుడు ఆమోదించారంటూ ప్రశ్నలు సంధించారు. దీనితో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఆదేశాలతో వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ తమ తప్పును సరిదిద్దుకుంది. కాకతీయ కళాతోరణంతో కూడిన రాష్ట్ర ప్రభుత్వ రాజముద్రతో మరో ఫ్లెక్సీని ఏర్పాటు చేసింది. బాధ్యులైన పట్టణ ప్రణాళిక విభాగం అధికారులకు షో కాస్ట్ నోటీసులను జారీ చేసింది.

# సీజనల్ వ్యాధుల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు: కలెక్టర్

నిజామాబాద్: ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు కట్టుదిట్టంగా కృషి చేస్తూ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు వైద్యాధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని కలెక్టర్ మంగళవారం



ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని అవుట్ పేషంట్, ఇన్ పేషంట్ విభాగాలను, ఫీవర్ వార్డు, ఆపరేషన్ థియేటర్, శస్త్ర చికిత్స వార్డు, రక్త నిధి కేంద్రం, సెంట్రల్ ల్యాబ్, ఎలిసా టెస్ట్ సెంటర్, టీ.హబ్ సెంటర్ తదితర వాటిని సందర్శించి వాటి పనితీరును పరిశీలించారు. ప్రతిరోజూ సగటున ఎంతమంది రోగులు ఆసుపత్రికి వస్తున్నారు, వారిలో ఎంతమంది ఇన్ పేషంట్లుగా అడ్మిట్ అవుతున్నారు, డెంగ్యూ, మలేరియా, విషజ్వరాలు వంటి వాటితో ఎంతమంది ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారు తదితర వివరాలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్ ను అడిగి తెలుసుకున్నారు. రోగుల అవసరాలకు సరిపడా మందులు, ప్లాస్మా, ప్లేట్ లెట్ యూనిట్స్ అందుబాటులో ఉన్నాయా అని ఆరా తీశారు. ఆయా విభాగాల వారీగా అందిస్తున్న వైద్య సేవల పట్ల కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఫీవర్ వార్డులో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి, వారికి అందుతున్న వైద్యసదుపాయాల గురించి వాకబు చేశారు. బ్లడ్ శాంపిల్స్ సేకరించి, వాటిని పరీక్షించిన అనంతరం రోగులకు అందిస్తున్న రిపోర్టులు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆన్ లైన్ పద్ధతిలో నిర్వహిస్తున్న ఓ.పీ రిజిస్ట్రేషన్ విధానాన్ని పరిశీలించిన కలెక్టర్, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... వర్షాకాలం అయినందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా అధికారులను అప్రమత్తం చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛదనం %-% పచ్చదనం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించడమే కాకుండా, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తున్నామన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలపై వారికి క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. ముఖ్యంగా జ్వరాలతో ఆసుపత్రులకు వచ్చే ప్రతి ఒక్కరికి రక్త నమూనాల సేకరణ, ఇతర వైద్య పరీక్షలు నిర్వహించి డెంగ్యూ, మలేరియా, వైరల్ ఫీవర్, డయేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా, మెరుగైన వైద్య సేవలు అందించేలా పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని తెలిపారు. సీజనల్ వ్యాధుల తీవ్రతను దృష్టిలో పేరుకుని జీజీహెచ్ లో 24 గంటల పాటు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. జీజీహెచ్ తో పాటు జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, సీహెచ్సీలు, పీహెచ్సీలలో ప్రత్యేకంగా ఫీవర్ వార్డులను నెలకొల్పి సీజనల్ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారికి మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి చేస్తున్నామన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లోనూ సీజనల్ వ్యాధులకు సంబంధించిన రోగుల వివరాలను కూడా రోజువారీగా తెప్పించుకుని, వారికి అందిస్తున్న వైద్య సేవలను జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులచే నిశితంగా పర్యవేక్షణ జరిపిస్తున్నామని కలెక్టర్ వివరించారు. అన్ని ప్రైవేట్ హాస్పిటల్స్ లో వైద్య చికిత్సలకు నిర్ణీత రుసుము మాత్రమే వసూలు చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కలెక్టర్ స్పష్టం చేశారు.

కాగా, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో అన్ని రకాల అధునాతన వైద్య పరికరాలు, ఎలిసా టెస్టింగ్, ప్లాస్మా, ప్లేట్లెట్స్ సెపరేషన్ వంటి యంత్రాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులకు హితవు పలికారు. జీజీహెచ్ లో మౌలిక వసతుల మెరుగుదలకు సంబంధించిన ప్రతిపాదనలపై అధికారులతో చర్చించి కీలక ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ వెంట జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిని డాక్టర్ రాజశ్రీ, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్ తదితరులు ఉన్నారు.

## దేశంలో మన మందుబాబులే

# టాప్ !



హైదరాబాద్: ఎలాంటి సందర్భమైనా తెలంగాణలో తప్పనిసరి చుక్కపడాల్సిందే. మద్యం కిక్కు కోసం మన వాళ్లు వెంపర్లాడినంతగా మరెవరూ వెంపర్లాడరు. దేశంలో మద్యంపై తలసరి ఖర్చులో మన రాష్ట్రమే టాప్. ఈ విషయం కేంద్ర ఆర్థిక శాఖ పరిధిలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ(ఎన్ఐపిఎఫ్ పి) నిర్వహించిన అధ్యయనంలో వెల్లడయింది. తెలంగాణ తలసరి ఖర్చు మద్యంపై రూ. 1623 కాగా, ఆంధ్రప్రదేశ్ లో అది రూ. 1306 గా ఉంది. రెండు తెలుగు రాష్టాలు కాక రూ. 1000 కంటే ఎక్కువ తలసరి ఆదాయాన్ని ఖర్చు పెడుతున్న ఇతర రాష్టాలలో ఛత్తీస్ గఢ్, ఒడిశా, పంజాబ్ రాష్ట్రాలున్నాయి.

## సంపాదకీయం

బుధవారం, ఆగస్టు 28, 2024

# న్యాయదీపం ధర్మ తీర్పు.........!

ఎట్టకేలకు సుప్రీంకోర్టు చరిత్ర మరువని వర్గీకరణ తీర్పును వెలువరించింది. ఉపకులాల అభివృద్ధికి ఎస్సీ వర్గీకరణ అవసరమనే తీర్పును వెలువరిస్తూ ఏడుగురు సభ్యులతో కూడిన ధర్మాసనం తీర్పునిచ్చింది. మూడు దశాబ్దాలుగా సాగిన వర్గీకరణ పోరాటంలో ఎంతో మంది అసువులు బాశారు. ఎన్నికల ముందు ప్రతీ రాజకీయ పార్టీ మా దిగల డిమాండ్ ఎస్సీ వర్గీకరణను సమర్ధిస్తూనే తీవ్రమైన నిర్లక్ష్యం వహిస్తూ వచ్చాయి. ఎస్సీలో ఉన్న అసమానతలపై అనేక కమిషన్లను గత ప్రభుత్వాలు నియమించాయి. 1998లో రామచంద్రరాజు కమిషన్ సైతం ఎస్సీ వర్గీకరణ అవసరమని చెప్పింది. దీంతో ఉమ్మడి రాష్ట్రంలో 2000ల సంవత్సరంలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను అమలు చేసింది. ఫలితంగా విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో మాదిగ, ఇతర ఉపకులాల ప్రాతినిధ్యం పెరిగింది. కాగా కేవలం నాలుగు సంవత్సరాల తరువాత సుప్రీంకో ర్టుకు వెళ్లడంతో 2004లో సుప్రీంకోర్టు రాష్ట్రాలకు వర్గీకరించే అధికారాన్ని తొల గించింది. ఫలితంగా మళ్లీ వర్గీకరణ ఉద్యమం అలుపులేకుండా సాగింది. జస్టిస్ రామచంద్రరాజు కమిషన్, 1997 ఎస్సీ లను నాలుగు గ్రూపులుగా విభజించి, ఒక్కొక్కరికి విడివిడిగా రిజర్వేషన్లు కేటాయించాలని సిఫార్సు చేసింది. ప్రభుత్వ నియామకాలు, విద్యా సంస్థల్లో ప్రవేశాలలో ఎలాంటి రిజర్వేషన్ ప్రయోజనాలను పొందకుండా షెడ్యూల్డ్ కులాల క్రీమీ లేయర్‌ను మినహాయించాలని కూడా సిఫార్సు చేసింది. ఆంధ్రప్రదేశ్, పంజాబ్, తమిళనాడు, బిహార్‌లలో అత్యంత బలహీన దళితులకు ప్రత్యేక కోటాలను ప్రవేశపెట్టారు. 2007లో బిహార్‌లో వెనుకబడిన ఎస్సీలలోని కులాలను గుర్తించేందుకు మహాదళిత్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. తమిళనాడులో, ఎస్సీ కోటాలో 3% కోటా అరుంధతీరాయ్ కులానికి కేటాయించారు. కాగా 2007లో నియమించిన జస్టిస్ ఉషామెహ్రా కమిషన్ సైతం వర్గీకరణకు అనుకూలమైన రిపోర్టు ఇచ్చినప్పటికీ ప్రభుత్వాలు చొరవ చూపలేదు. దీంతో ఇన్ని దశాబ్దాలుగా అలుపెరగని పోరాటం సాగింది. తెలుగు రాష్ట్రాల్లో అతిపెద్ద సామాజిక వర్గంగా ఉన్న మాదిగలు అన్ని రంగాల్లో నేటికీ ఇంతటి ఆధునిక యుగంలో అట్టడుగులోనే ఉన్నారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించి అట్టడుగున ఉన్న మాదిగలతో పాటు ఉపకులాలకు న్యాయం జరగాలని ఎస్సీ వర్గీకరణ ఉద్యమం మొదలై మూడు దశాబ్దాలు అయింది. తెలుగు రాష్ట్రాలలో అతిపెద్ద సామాజిక వర్గంగా తెలంగాణలో 2014 నాటికే మాదిగల జనాభా 12 శాతానికి చేరినట్లు సమగ్ర కుటుంబ సర్వే లెక్కల ద్వారా అర్థం అవుతుంది. దళితులకు ఉమ్మడి రిజర్వేషన్ల వల్ల మాదిగలు, ఉపకులాలు నష్టపోతున్నారు. కాగా తాము అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని బీజేపీ సర్కా రు స్పష్టమైన హామీని ఎన్నికల సమయంలో ఇచ్చింది. అయినప్పటికీ పదేళ్లు పట్టించుకోలేదు. మరో పక్క పార్లమెంటు సమావేశాల్లోనూ నాటి టీఆర్ఎస్ ఎంపీలు అనేకసార్లు వర్గీకరణపై ప్రశ్నించారు. గత ఫిబ్రవరి నెలలో సుప్రీంకోర్టులో ఎస్సీ వర్గీకరణపై వాదనలు విని తీర్పును రిజర్వ్ చేశారు. ఎట్టకేలకు ఏడుగురు సభ్యులతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం వర్గీకరణకు సానుకూల తీర్పునిచ్చింది. ఎస్సీ కులాల్లోనూ ఇంకా వెనుకబాటులో ఉన్న వారిని దృష్టిలో ఉంచుకొని వర్గీకరణకు అనుకూలంగా ఇచ్చిన తీర్పు చరిత్రలో ఎప్పటికీ ధర్మబద్ధమైనదిగా నిలవనున్నది. రాష్ట్రాలకే పూర్తి అధికారాలు ఇస్తూ సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పునిచ్చింది. ఎస్సీ వర్గీకరణకు తామంటే తాము అనుకూలమంటూ ఓట్లు వేయించుకున్న పార్టీలు.. మాదిగల ఆవేదనను సరిగా అర్థం చేసుకోలేకపోయాయి. ఫలితంగా జనాభా పరంగా అధిక సంఖ్యలో ఉండి ఉద్యోగ, విద్య, ఉపాధి రంగాల్లో మాదిగ, ఉపకులాలు ఆమడ దూరంలో ఉండి అంధకారంలోనే ఉండిపోయాయి. ఒక జాతి సమస్యను పరిష్కరించడానికి.. మూడు దశాబ్దాల సమయం పట్టిందంటే ఆ వర్గం మరెంత వెనుకబాటుకు గురైందో అర్థం చేసుకోవచ్చు. వర్గీకరణ ఏ ఇతర వర్గాలకు వ్యతిరేకం కాదు. కేవలం సామాజిక వెనుకబాటు నుంచి సమానత్వం వైపు తేవడానికే ఈ తీర్పు అనేది గమనించాలి. తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 60 లక్షల వరకు మాదిగలు అతిపెద్ద సామాజిక వర్గంగా ఉన్నా విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో వెనుకబాటులోనే ఉన్నారు. ప్రస్తుతం పార్ల మెంట్ ద్వారా చట్టం ఉండాలనే నిబంధనను కొట్టివేసి.. ఎస్సీ వర్గీకరణ అమలు బాధ్యత రాష్ట్రాలకే అధికారం ఇస్తూ తీర్పు ఇవ్వడం శుభ పరిణామం. తరతరాలు వెనుకబాటుకు గురవుతున్న మాదిగలకు ఈ తీర్పు గొప్ప సంబురమనే చెప్పవచ్చు. విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో మాదిగలు, ఉపకులాల వారికి మెరుగైన అవకాశాలు దక్కే అవకాశం ఉంది. తెలంగాణలోనే అన్ని రాష్ట్రాల కంటే ముందే వర్గీకరణ అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం దళితుల జీవితాల్లో ఓ శుభపరిణామంగా చెప్పవచ్చు.

# బిసిల చాంపియన్ శివశంకర్!




తామే వెనకబడిన తరగతుల వారికి నాయకులమని, తోటి వారి అభ్యున్నతే తమ ఏకైక లక్ష్యమని చాలా మంది వకాలతా పుచ్చుకుని, ఎన్నికల్లో, లేదా పదవులు పొందడంలో బిసి కార్డులను ఉపయోగించుకుని, తీరా పదవులు పొందాక, లక్ష్యాన్ని నిర్లక్ష్యం చేయడం సర్వసాధారణం. కానీ అలాకాక తాము పొందిన పదవుల ద్వారా బిసిల అభివృద్ధికి పాటుపడిన వారు బహు అరుదుగా కనిపిస్తారు. అలా బీసీల అభివృద్ధికి తోడ్పడిన వాళ్లలో పుంజాల శివ శంకర్ గారు మొదటి వరుసలో ఉంటారు. కింది స్థాయి నుంచి ఎదిగి నాయకులూ అయ్యే వారు చాల మంది ఉంటారు, కాని ఒక బలహీన వర్గాల కుటుంబంలో అది కూడా ఒక పేద కుటుంబంలో పుట్టి దేశ రాజకీయలను ఒక దశాబ్దం పాటు శాసించే స్థాయికి ఎదగటం, అది కూడా ఇందిరా గాంధీ లాంటి శక్తిశాలికి కుడి భుజంలాగా ఉండటం, ఇందిర, రాజీవ్ అధికార నివాసాలకు పక్కనే ఎప్పటికీ ఇల్లు ఉండటం ఒక్క శివశంకర్ కే సాధ్యమైంది. బలహీన వర్గాల నాయకుడిగా పేరున్న శివశంకర్ తెలంగాణ మూన్నూరు కాపు కులానికి చెందిన నాయకుడు.

1929, ఆగస్టు 10న హైదరాబాద్ సమీపంలో ని మామిడి పల్లిలో ఆయన జన్మించారు. శివశంకర్ మెట్రిక్యులేషన్ వరకు హైదరాబాద్ లో చదివి ఆ తర్వాత చదువుకు ఇంట్లో ఇబ్బందులు ఏర్పడడముతో తన అన్నతో కలిసి పంజాబ్ కు వెళ్లి, కూలి పనులు చేస్తూ కొన్ని సందర్భాలలో తిండిలేక మజ్జిగ తాగుతూ, పల్లీలు తింటూ చదువుకుంటూ అమృత్ సర్ హిందూ కాలేజీ నుండి బీ.ఏ.పూర్తి చేశారు. తర్వాత ఉస్మానియా యూనివర్శిటీ నుంచి ఎల్ ఎల్ బి పూర్తి చేశారు. న్యాయ శాస్త్రాల్లో, ఇంగ్లీష్ భాషలో మంచి పట్టుగల శివశంకర్ హైదరాబాద్ లో న్యాయవాదిగా ప్రాక్టీసును ప్రారంభించి పేదల బడుగు బలహీన వర్గాల కేసులను ఉచితంగా కోర్టులలో వాదించేవారు. మంచి సమర్థుడైన న్యాయవాదిగా పేరు తెచ్చుకొని సిటీ సివిల్ కోర్ట్ బార్ అసోసియేషన్ కార్యదర్శిగా, 1956లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడిగా పని చేశారు. 1972లో ఆంధ్రప్రదేశ్ లో వెనుకబడిన తరగతులకు 25 శాతం రిజర్వేషన్లు కల్పించారు.

ఆ తర్వాత అనంతరామన్ కమిషన్ ప్రభుత్వానికి సూచనలు చేస్తూ బీసీ కులాలకు 30% రిజర్వేషన్లు ప్రతిపాదించింది. దీనిపై ఏపీ హైకోర్టులో 110 రిట్ పిటిషన్లు దాఖలయ్యాయి, అప్పుడు బీసీలకు 30% రిజర్వేషన్లు చెల్లవని హైకోర్టు తీర్పునివ్వగా... నాటి జేఏసి తరపున శివశంకర్ సొంత ఖర్చుతో 18 నెలలు ఢిల్లీలో ఉండి సుప్రీం కోర్టులో బీసీ రిజర్వేషన్లను గెలిపించుకొని తిరిగి వచ్చారు. 1974 నాటికి చిన్న వయసులోనే ఆంధ్రప్రదేశ్ హై కోర్ట్ జడ్జిస్థాయికి ఎదిగారు. ఆంధ్రప్రదేశ్ లోని న్యాయ వ్యవస్థలో ఒకే కులానికి చెందినవారు ఆధిపత్యం వహిస్తూ సీనియారిటి ప్యానల్ లో మిగతా వారిని పరిగణన లోకి తీసుకోక పోవడం గమనించి తను ప్రభుత్వ న్యాయమూర్తి పరిధిలో పేదల బడుగు బలహీన వర్గాల తరపున పోరాటం చేయలేక పోతున్నానని ఏకంగా ఉద్యోగానికి రాజీనామా చేశారు. చదువుకోవడమంటే ప్రభుత్వ ఉద్యోగం సాధించడము సమాజాన్ని పట్టించు కోకుండా వ్యక్తిగత ఎదుగుదలే ముఖ్యంగా భావించే నేటి తరానికి సమాజం కోసం హై కోర్ట్ జడ్జి స్థాయి ఉద్యోగాన్ని వదులుకోవడము ఆయన చిత్తశుద్ధికి, త్యాగ నిరతికి నిదర్శనం. హై కోర్టు జడ్జిగా రాజీనామా చేసి హైకోర్టు, సుప్రీం కోర్టులల్లో న్యాయ వాదిగా ప్రాక్టీసు చేస్తూ అన్ని వర్గాలకి సామాజిక న్యాయం విషయములో అధ్యయనం చేస్తుండే వారు. ఆయన మొదటి సారి గా 1977 లో ఇందిరాగాంధీని కలుసుకున్నా తమ అపార న్యాయ విజ్ఞానంతో ఆమె మనసు చూరగొనడమే కాకుండా అతితక్కువ కాలంలో ఆమెకు అత్యంత సన్నిహితుడయ్యారు. 1974-75లో ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ న్యాయమూర్తిగా ఉన్నారు. 1977 లో ఎమర్జెన్సీ తర్వాత ఆయన ఇందిగా గాంధీకి న్యాయవాదిగా కూడా ఉన్నారు. 1979లో సికిందరాబాద్ నుంచి లోక్ సభకు ఎన్నికయ్యారు. ఆ నియోజకవర్గం నుంచి 1980 లో రెండో సారి ఎన్నికయ్యారు. 1981లో ఇందిరాగాంది మంత్రివర్గంలో చాలా కీలకమయిన నాయకుడిగా ఉన్నారు. 1985లో శివశంకర్ రాజ్యసభకు ఎన్నికయ్యారు. 1993 దాకా రాజ్యసభలోనే కొనసాగారు. ఈ మధ్యలో ఆయన విదేశీ వ్యవహారాల శాఖ, మానవ వనరుల శాఖ మంత్రిగా పనిచేశారు. కొద్ది రోజులు ప్లానింగ్ కమిషన్ డిప్యూటీ చైర్మన్ గా కూడా పనిచేశారు. 1988-89 లో రాజ్యసభ కాంగ్రెస్ పక్ష నాయకుడి గా ఉన్నారు. తర్వాత సిక్కిం, కేరళ వర్నర్ గా నియమితులయ్యారు. 1998లో తెనాలి నుంచి లోక్ సభ కు పోటీచేసి గెలుపొందారు. ప్రధాని నివాసానికి దగ్గరలో 5, సఫ్దర్ జంగ్ లేన్ బంగళాను ఆయన కేటాయించారు. ఇంధన శాఖను నిర్వహించిన సమయంలో, రాజకీయ జోక్యం లేకుండా, పెట్రోలు బంకులు, గ్యాస్ ఏజెన్సీల కేటాయింపులను క్రమబద్ధీ కరించారు. మానవ వనరుల శాఖ మంత్రిగా కేంద్రీయ విద్యాలయాల విస్తరణకు కృషి చేశారు. ఇందిరాగాంధి మరణానంతరం రాజీవ్ గాంధీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడానికి ముఖ్య పాత్ర పోషించిన శివశంకర్ మెదక్ (గతములో ఇందిరాగాంధి గెలిచిన స్థానం) నుండి లోక్ సభకు పోటీ చేసి స్వల్ప తేడాతో ఓడిపోవడముతో 1985 నుండి 1993 వరకు గుజరాత్ నుండి రాజ్యసభకు ఎన్నికై కేంద్ర వాణిజ్య శాఖామంత్రిగా 1985 లో ,1986 లో విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వ శాఖనూ నిర్వహించారు.

ఏ సభలో సభ్యత్వం లేని రోజులలో కూడా ఆయనకు ప్రధాని నివాసంతో విడదీయని సంబంధాలు ఉండేవి. అందుకే సఫ్దర్ జంగ్ లేన్ నివాసం చాలాకాలం కొనసాగింది. ఇందిర, రాజీవ్ కాలంలో అన్ని కీలకమయిన పార్టీ, ప్రభుత్వ నిర్ణయాలలో ఆయన పాత్ర వుండేది. రాజీవ్ హాయంలో చాలా కీలకమయిన నిర్ణయాలెన్నో తీసుకున్నా సరే ఆయన పనితీరు ఎపుడూ వివాదాస్పదం కాలేదు. ఆయన కూడా ఎపుడూ వార్తలక్కె ప్రయత్నం చేయలేదు.

రాజీవ్ దూతగా ఆయన నేపాల్, బంగ్లాదేశ్ లను సందర్శించి ఇరుగు పొరుగు దేశాలతో సత్సంబంధాలు నెలకొల్పడంలో ప్రధానికి బాగా సహకరించే వారని ఆయన మిత్రులు చెబుతారు. పంజాబ్ ఒప్పందంలో కూడా శివశంకర్ కీలక ప్రాత పోషించారని చెబుతారు. కాంగ్రెస్ లో సరైన గుర్తింపు లేక, స్వార్థ రాజకీయాలకు తట్టుకోలేక2004 లో ఆయన కాంగ్రెస్ ను వదిలేశారు. 2017 ఫిబ్రవరి 27న ఆయన మరణించారు. శివశంకర్ జీవితాంతం అంబేడ్కర్ , ఫూలే ఆదర్శంగా, ఆ మహా నాయకుల కాన్సెప్ట్ మీద పని చేశారు. జ్యుడీషియల్ తో సహ అన్నీ రంగాల్లో దళితులకు ప్రాతినిధ్యం ఉండాలని శివశంకర్ కోరుకునే వారు. ఇందిరా గాంధీ పక్షాన కేసులను వాదించి, ఆమెకు అత్యంత సన్నిహితులుగా ఉండేవారు. రాజీవ్ గాంధీ హాయంలో ప్రభుత్వంలో ప్రధాని తర్వాత చాలా పలుకుబడి ఉన్న వ్యక్తి శివశంకరే.

అలా బీసీల అభివృద్ధికి తోడ్పడిన వాళ్లలో పుంజాల శివ శంకర్ గారు మొదటి వరుసలో ఉంటారు.

కింది స్థాయి నుంచి ఎదిగి నాయకులూ అయ్యే వారు చాల మంది ఉంటారు, కాని ఒక బలహీన వర్గాల కుటుంబంలో అది కూడా ఒక పేద కుటుంబంలో పుట్టి దేశ రాజకీయలను ఒక దశాబ్దం పాటు శాసించే స్థాయికి ఎదగటం, అది కూడా ఇందిరా గాంధీ లాంటి శక్తిశాలికి కుడి భుజంలాగా ఉండటం, ఇందిర, రాజీవ్ అధికార నివాసాలకు పక్కనే ఎప్పటికీ ఇల్లు ఉండటం ఒక్క శివశంకర్ కే సాధ్యమైంది. బలహీన వర్గాల నాయకుడిగా పేరున్న శివశంకర్ తెలంగాణ మూన్నూరు కాపు కులానికి చెందిన నాయకుడు.

# ఓటమి ఎరుగని నాయకురాలు...







ఆమె ముఖ్యమంత్రి. దేశంలో ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన ద్వితీయ మహిళ. ఐదున్నర దశాబ్దాల రాజకీయ జీవితంలో ఓటమి ఎరుగని ప్రజా విశ్వాసాన్ని చూరగొన్న నాయకురాలు. భారత దేశాన్ని అప్రతి హతంగా కొంతకాలం ఏలిన దేశ తొలి తొలి మహిళా ప్రధాని ఇందిరా గాంధీకి అత్యంత సన్నిహితురాలు, విశ్వస నీయురాలు.

ఆమెనే ఐరన్ లేడీ ఆఫ్ ఒడిశాగా పేరెన్నిక గన్న నందిని సత్పతి. నందిని సత్పతీ (1931 జూన్ 9 ం 2006 ఆగస్టు 4), జూన్ 1972 నుంచి డిసెంబరు 1976 వరకు ఒడిశా రాష్ట్ర ముఖ్యమంత్రిగా చేశారు. 1931 జూన్ 9న ఆమె జన్మించారు. ఆమె తండ్రి పద్మభూషణ్ కలాండి చరణ్ పాణిగ్రాహి ఒడిశాకు చెందిన సుప్రసిద్ధ వ్యక్తి. ఆమె తాత స్వనేశ్వర్ పాణిగ్రాహి గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు.

ఆమె మామ భగవతి చరణ్ పాణిగ్రాహి ఒడిశాలో కమ్యూనిస్ట్ పార్టీ స్థాపకులు. ఆమె రెండుసార్లు ధెంకనల్ నుండి ఎంపీగా ఎన్నికయ్యారు. 1972 లో, సార్వత్రిక ఎన్నికల్లో నలుగురు మాజీ ముఖ్య మంత్రులతో ఆమె ఒంటరి పోరాటం చేసి విజయం సాధించారు. రావెన్షా కళాశాలలో ఒడియాలో ఆర్ట్స్ లో మాస్టర్స్ డిగ్రీ చదివేటప్పుడు, ఆమె కమ్యూనిస్ట్ పార్టీ విద్యార్థి శాఖ అయిన స్టూడెంట్ ఫెడరేషన్ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనేవారు. 1951లో కళాశాల విద్యకు రుసుములు పెరిగిన నేపథ్యంలో ఒడిశాలో విద్యార్థులు నిరసన ఉద్యమం ప్రారంభించారు. ఆ తరువాత అది దేశవ్యాప్త ఉద్యమంగా రూపుదాల్చింది. ఆ ఉద్యమానికి నందిని నాయకత్వం వహించారు. ఆ సమయంలో ఆమెపై లాఠీ చార్జి కూడా జరిగింది. మిగిలిన ఆందోళన కారులతో పాటు నందినిని కూడా జైలులో పెట్టారు. అక్కడే మరో విద్యార్థి నాయకుడు దేవేంద్ర సత్పతీని కలిశారు ఆమె.

తరువాత వారిద్దరూ వివాహం చేసుకున్నారు. దేవేంద్ర ధేస్యనల్ నియోజకవర్గం నుంచి లోక్ సభకు ఎంపిగా రెండు సార్లు ఎన్నికయ్యారు. నందిని సత్పతి 1962 లో రాజ్యసభలో ప్రవేశించారు. ఇందిరా గాంధీ ప్రధాని అయిన తరువాత, నందిని సత్పతిని తన మంత్రివర్గంలో సమాచార, ప్రసార ఉప మంత్రిగా, తదుపరి మంత్రిగా నియమించు కున్నారు. నందిని సత్పతిని ప్రధానమంత్రి ఇందిరా గాంధీ రాజకీయములో కుడి భుజంగా భావించే వారు.

బిజు పట్నాయక్ మరికొంత మంది కాంగ్రెస్ పార్టీ నుండి నిష్క్రమించిన కారణంగా 1972 లో నందిని సత్పత్తి ఒడిశాకు తిరిగి వచ్చి, ముఖ్యమంత్రి (జూన్ 1972 నుండి 1976 డిసెంబర్వ) అయ్యారు. అలా ఒడిశా మొదటి మహిళా ముఖ్యమంత్రిగా ఉన్నారు. భారత దేశంలో ముఖ్యమంత్రి అయిన రెండవ మహిళగా చరిత్రలో నిలిచారు. ఆమె వ్యక్తిత్వంలో ఫైర్ బ్రాండ్ నాయకత్వాన్ని గుర్తించిన ఇందిరా గాంధీ ఆశీస్సులతో నందిని ముఖ్యమంత్రిగా తొలి సారిగా జూన్ 14, 1972 లో బాధ్యతలు స్వీకరించారు. భారత దేశంలో ఎమర్జెన్సీ విధించినప్పుడు ఆమె పదవీకాలం ఒక సంవత్సరంలో ముగిసింది. మార్చి 6, 1973 నుండి డిసెంబర్ 16, 1976 వరకు ఆమె రెండవసారి తిరిగి ఎన్నికయ్యారు. నందిని సత్పత్తిని 'ఐరన్ లేడీ ఆఫ్ ఒడిశా' అని 1998 పిలిచేవారు. నందిని సత్పతి రాజకీయాలలోనే లోనే గాక ఒక రచయితగా గుర్తింపు పొందారు. ఆమె తస్లిమా నస్రీన్ నవల లజ్జాను ఒడియాలోకి అనువదించారు. అది చేసిన ప్రధాన సాహిత్య రచన. నందిని సాహిత్య రచనలు ఇతర భాషల లోనికి అనువదించబడి ప్రచురించ బడ్డాయి.

సాహిత్యానికి ఆమె చేసిన కృషికి, 1998లో సాహిత్య భారతి సమ్మన్ అవార్డును అందుకుంది. ఆమె ముఖ్య మంత్రిగా పని చేసినప్పుడు ఒడియా జాతీయ అత్యవసర పరిస్థితి ఆమె రాజకీయ జీవితంలో కష్టతరమైన సవాలు. కొందరు రాజకీయ నాయకులను అరెస్టు చేయడంతో ఆమె విమర్శలు ఎదుర్కొన్నారు. అల్లకల్లోల సమయంలో ఆమె చేసిన మితిమీరిన చర్యలకు ఆమె ఎప్పుడూ మద్దతు ఇవ్వలేదు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఆమె చేసిన పనితీరు దాదాపు ప్రతి రంగంలోనూ వృద్ధిని సాధించింది. ముఖ్యంగా, మహిళల సాధికారత, గ్రామీణ వృద్ధి, కళ, సంస్కృతి, విద్య వంటి రంగాలలో, ఆమె విశేషమైన చర్యలు తీసుకున్నారు. కార్యక్రమాలు నేటి వరకు ప్రజల జ్ఞాపకాలలో మరవలేనిది రాజకీయ పరిశీకులు పేర్కొంటారు.

రైతులు లేదా వ్యవసాయ దారులు కాని భూములను తమ ఆధీనంలో ఉంచిన కొద్దిమంది వ్యక్తుల చేతుల నుండి భూములను విడిపించే ప్రత్యేకమైన భూ సంస్కరణలు చట్టాన్ని తీసుకురావడం ఒక చరిత్రగా ఒడిశా రాష్ట్ర ప్రజలలో మిగిలి పోతుంది. నందిని సత్పతి 2006 ఆగస్టు 04 న భువనేశ్వర్ లోని తన నివాసంలో అనారోగ్యంతో మరణించారు.

# చీరలో చంపేస్తున్న రాక్షసి

బ్యూటీఫుల్ శారీలుక్ లో తాజాగా అను అమ్మాన్యుయేల్ ఫోటోలకు ఫోజులిచ్చింది. ఈ ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది ఈ ముద్దుగుమ్మ. మజ్ను సినిమాతో తెలుగు ఇండస్ట్రీకి పరిచయమైంది ఈ భామ. ఆ తర్వాత కిట్టు ఉన్నాడు జాగ్రత్త, గీత గోవిందం సినిమాలో అతిధి పాత్రలో, శైలజా రెడ్డి అల్లుడు, అల్లుడు అదుర్స్, మహా సముద్రం, ఊర్వశివో రాక్షశివో వంటి పలు సినిమాల్లో నటించింది. అయితే టాలీవుడ్ స్టార్ హీరోయిన్ గా ఎదుగుతుందని అందరూ భావించిన ఈ అమ్మడు సినిమాలన్ని వరుస ఫ్లాపులతో ఢీలా పడిపోయింది. ఇక్కడ అవకాశాలు రాకపోయిన తమిళంలో మాత్రం సూపర్ క్రేజీ సంపాదించుంకుంది. ఇక ఈ బ్యూటీ నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటుంది.

ఎప్పటికప్పుడు తన లేటెస్ట్ ఫోటోషూట్‌లతో ఫాన్స్‌ని మెస్మరైజ్ చేస్తుంటుంది. తాజాగా ఎల్లోకలర్ శారీ లుక్ లో ఫోటోలకు ఫోజులిచ్చింది. ఈ ఫోటోలను తన ఇన్ స్టాగ్రామ్ లో పోస్ట్ చేస్తూ Sunshine on a rainy day in @raw_mango అంటూ కాప్షన్ ఇచ్చింది ఈ భామ.



# యాక్షన్ మూడ్‌ని చాలా ఎంజాయ్ చేస్తారు: నాని



నేచురల్ స్టార్ నాని, క్రియేటివ్ డైరెక్టర్ వివేక్ ఆత్రేయ మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా ఫిల్మ్ 'సరిపోదా శనివారం'. ప్రియాంక అరుల్ మోహన్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ మూవీలో ఎస్‌జె సూర్య పవర్‌ఫుల్ రోల్ ప్లే చేస్తున్నారు. ఈ చిత్రాన్ని డివివి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై డివివి దానయ్య, కళ్యాణ్ దాసరి హై బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ అడ్రినలిన్ ఫిల్ యాక్షన్- అడ్వెంచర్ గురువారం తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో గ్రాండ్ గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో నేచురల్ స్టార్ నాని మీడియాతో ముచ్చటిస్తూ చెప్పిన విశేషాలు.




**రిఫ్రెషింగ్‌గా అనిపించింది**

సరిపోదా శనివారం సినిమా నాకు చాలా రిఫ్రెషింగ్‌గా అనిపించింది. సాధారణంగా నా సినిమాలన్నింటిలో తెలియని ఒక బరువుని మోస్తుంటాను. అది ఈసారి ఎస్‌జె సూర్య మీద, వివేక్ మీద వుంది. నేను కొంచెం బ్యాక్ సీట్ తీసుకున్నాను. పర్ఫార్మెన్స్ పరంగా ఎస్‌జె సూర్య, ప్రియాంక, మురళీశర్మ.. ఇలా అందరిపై భారం వుంది.

**చాలా ఎంజాయ్ చేశాను...**

ఎస్‌జె సూర్యతో కలసి నటించడం చాలా ఎంజాయ్ చేశాను. ఆ రోల్‌కి ఆయన తప్పితే మరో చాయిస్ లేదు. డబ్బింగ్ దాదాపు ఏడు రోజులు చెప్పారు. అద్భుతంగా వచ్చింది. తన డబ్బింగ్ కోసం మరో రెండుసార్లు సినిమా చూస్తారు.

**మంచి కథ ఇది...**

సరిపోదా శనివారం చాలా మంచి కథ. అడ్రినలిన్ పంపింగ్ మూమెంట్స్ వుంటాయి. కథ ప్రకారం ఆ అడ్రినలిన్ పంపింగ్ వందశాతానికి తీసుకెళ్ళాం. సినిమా చాలా ఆర్గానిక్‌గా కుదిరింది. థియేటర్స్‌లో ఆడియన్స్ చాలా ఎంజాయ్ చేస్తారు.

**తన మ్యాజిక్ చూస్తారు...**

ఇది చాలా రేసీ ఫిలిం. నెరేటివ్ కూడా రేసీగా వుంటుంది. సినిమా పరిగెడుతుంటుంది. సాధారణంగా సినిమాల్లో హీరోకి ఇంట్రో సాంగ్ వుంటుంది. తర్వాత మేలోడీలు, ఎమోషనల్ సాంగ్స్ వస్తాయి. కానీ జేక్స్ బిజోయ్ మొత్తం సినిమాని హీరో ఇంట్రో సాంగ్‌లా కొట్టాడు. తన మ్యాజిక్ గురువారం చూస్తారు.

**నా ఫేవరేట్ మూమెంట్ అది...**

ఈ సినిమాకి సరిపోదా శనివారమే అని టైటిల్ పెట్టడానికి అదిరిపోయే కారణం వుంది. నా ఫేవరేట్ మూమెంట్ అది. సినిమా ప్రారంభమయ్యే ఐదు నిమిషాలకి వస్తుంది.

**స్క్రీన్ ప్లే చాలా ఆసక్తికరంగా...**

ఈ సినిమాలో 20 శాతం యాక్షన్, 80 శాతం యాక్షన్ మూడ్ వుంటుంది. ఇందులో యాక్షన్ మూడ్‌ని ఆడియన్స్ చాలా ఎంజాయ్ చేస్తారు. 'సరిపోదా శనివారం' స్క్రీన్ ప్లే, నెరేటివ్ చాలా ఆసక్తికరంగా వుంటుంది.

# 'బిగ్ బాస్' 8 ప్రసారానికి డేట్ ఫిక్స్




పాపులర్ రియాల్టీ షో 'బిగ్ బాస్' తెలుగు... ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ తెలుగు టీవీ రియాల్టీ షో మరో నాలుగు రోజుల్లో ప్రారంభం కానుంది. దాదాపు 100 రోజుల పాటు ప్రేక్షకులను టీవీకి అతుక్కుపోయేలా చేసే ఈ రియాల్టీ షో స్ట్రీమింగ్ డేట్ ఫిక్స్ అయింది. ఇప్పటికే ఏడు సీజన్లు పూర్తి చేసుకున్న బిగ్ బాస్%ౌ% అక్కినేని నాగార్జున హెూస్ట్‌గా 8వ సీజన్ ప్రారంభం కానుంది. దీనికి సంబంధించి, స్టార్ మా తాజా సీజన్-8 స్ట్రీమింగ్ తేదీలను ప్రకటించింది. బిగ్ బాస్ 8 సెప్టెంబర్ 1 ఆదివారం రాత్రి 7 గంటల నుండి ప్రసారం కానుందని స్టార్ మా అధికారికంగా తెలిపింది. సోమవారం నుంచి శుక్రవారం వరకు ప్రతిరోజూ రాత్రి 9:30 గంటలకు బిగ్ బాస్ ప్రసారం కానుంది. అయితే శని, ఆదివారాలు రాత్రి 9 గంటలకు ప్రసారం అవుతుంది. గత సీజన్ మాదిరిగానే, ఈసారి కూడా హాట్‌స్టార్‌లో 24/7 ప్రసారం అవుతుంది. బిగ్ బాస్ తెలుగు 8 మొదటి కంటెస్టెంట్ జాబితాలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌లతో పాటు ఎంటర్టైన్మెంట్ ప్లాట్‌ఫారమ్‌ల నుండి 14 మంది ప్రముఖులు ఉన్నారు. విష్ణుప్రియ భీమినేని, శేఖర్ బాషా, బెజవాడ బేబక్క, నైనికా, విస్మయ శ్రీ, ఆదిత్య ఓం, మోడల్ రవితేజ, దర్శకుడు పరమేశ్వర్, ఖయ్యూమ్ అలీ, సౌమ్యరావు, గాయకుడు సాకేత్, అంజలి పవన్, అభినవ్ నవీన్, అభిరామ్ వర్మ.

# త్యాగానికి ప్రతిరూపమే ప్రేమ, బంధం: సమంత



నటుడు నాగచైతన్య నుంచి విడిపోయాక నటి సమంత బాధపడుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆమె 'సిటాడెల్: హనీ బన్నీ' అనే వెబ్ సిరీస్ లో నటిస్తోంది. రాజ్ నిడిమోరు, డికె డైరెక్షన్ లో వస్తున్న ఈ వెబ్ సిరీస్ లో వరుణ్ ధావన్ నటిస్తున్నాడు. సమంత దీని తర్వాత 'బంగారం' అనే సినిమాలోనూ కనిపించనున్నది. నాగచైతన్య, శోభితా ఎంగేజ్మెంట్ తర్వాత సమంత కూడా డైరెక్టర్ రాజ్ నిడిమోరుతో డేటింగ్ చేస్తోందంటూ నిరాధార పోస్ట్ లు నెట్టింట సందడి చేశాయి. ఇలాంటి నేపథ్యంలో సమంత రుత్ ప్రభు తాజాగా ఇన్ స్టాగ్రామ్ లో పోస్ట్ పెట్టింది. 'ప్రేమ' గురించి ఏమిటేమిటో రాసుకొచ్చింది. దాని గురించి చెప్పడం కంటే ఆ పోస్ట్ ను చదువుకుని మీకు మీరు అర్థం చేసుకోండి ఆమె భావాలేమిటో.